సాక్షి ఖమ్మం

సోమవారం । 23 । అక్టోబర్‌ । 2023



అంతా విజయమే..

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే విజయదశమి పండుగ నిర్వహణకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. IIలో



ఏఐసీసీ నేతలతో భేటీ

జిల్లాకు చెందిన కాంగ్రెస్‌ నాయకులు పలువురు.. సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో కలిసి ఢిల్లీలో ఏఐసీసీ నేతలతో భేటీ అయ్యారు. IIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
33° / 19°

జిల్లాలో ఆదివారం ఉదయం, రాత్రి చలి ప్రభావం కనిపిస్తుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రత నమోదవుతుంది.

మళ్లీ రావమ్మా!

- ఊరూవాడా సద్దుల సంబురం
- ఆడిపాడిన మహిళాలోకం

తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలు పుట్టింటికి వచ్చిన ఆడబిడ్డల చేతుల్లో అమరిపోయాయి. ఎనిమిది రోజుల పాటు బతుకమ్మ జరుపుకున్న మహిళలు చివరి రోజు సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే పేర్చిన బతుకమ్మలకు ఇళ్లలో పూజలు చేశాక ఖమ్మంలో మున్నేరు వద్దకు, ఇతర చోట్ల బతుకమ్మ ఘాట్లకు సాయంత్రం చేరుకున్నారు. అక్కడ బతుకమ్మలను పెట్టి చుట్టూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం నిమజ్జనం చేసి బతుకమ్మా.. మళ్లీ రావమ్మా అని వేడుకున్నారు. అలాగే, వాయినాలు ఇచ్చి పుచ్చుకుని ఇళ్లకు పయనమయ్యారు.

– సాక్షి నెట్‌వర్క్‌



ఖమ్మం మున్నేరు వద్ద బతుకమ్మల చుట్టూ ఆడిపాడుతున్న మహిళలు



బతుకమ్మలతో మున్నేరు వద్దకు వస్తూ..



దస్సేజస్సీ ఆడుతున్న మహిళలు



వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు



బతుకమ్మలను మున్నేరులో నిమజ్జనం చేస్తూ..

న్యూస్‌రీల్‌

శ్రీదుర్గాదేవి రూపంలో అమ్మవారు



శ్రీదుర్గాదేవి రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా ఎనిమిదో రోజైన ఆదివారం శ్రీవారికి పూజల చేశాక, అలివేలు మంగ అమ్మవారిని శ్రీదుర్గాదేవి రూపంలో అలంకరించారు. తెలంగాణ, ఏపీకి చెందిన వివిధ ప్రాంతాల భక్తులు వేలాదిగా పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్‌ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఉప ప్రధాన అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, అర్చకులు ఉప్పల మురళీమోహన్‌ శర్మ, రాజీవ్‌శర్మ, సూపరింటెండెంట్‌ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన ఏసీపీ



వాహనంలో సరుకులు పరిశీలిస్తున్న ఏసీపీ

కూసుమంచి: ఎన్నికల నేపథ్యాన జిల్లా సరిహద్దు నాయకన్‌గూడెంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్‌ను ఆదివారం రాత్రి ఖమ్మంరూరల్‌ ఏసీపీ బస్వారెడ్డి తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేసిన ఆయన ఉద్యోగులకు సూచనలు చేశారు. వాహనాల్లో నగదు, మద్యం, బంగారం తరలించే అవకాశమున్నందున క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తెలిపారు. కూసుమంచి సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సై రమేష్‌కుమార్‌ పాల్గొన్నారు.

జాతీయ టోర్నీకి మరో నలుగురు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్‌: సంగారెడ్డిలోని కొల్లూరు ఢిల్లీ పబ్లిక్‌ స్కూల్‌లో రాష్ట్రస్థాయి సీనియర్స్‌ పురుషుల ఆర్చరీ పోటీలు కొనసాగుతున్నాయి. ఈమేరకు ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి హాజరైన క్రీడాకారులు నలుగురు సత్తా చాటడంతో రాష్ట్రజట్టులో స్థానం లభించింది. ఇండియాన్‌ రౌండ్‌లో కె.లక్ష్మణ్‌, పి.నగేష్‌, కె.సర్వేష్‌ ఎంపిక కాగా కాంపౌండ్‌ రౌండ్‌లో వి.శివసాయి స్థానం సాధించాడు. రాష్ట్ర జట్టులో ఇప్పటి వరకు సీనియర్స్‌, జూనియర్స్‌ విభాగాల్లో ఉమ్మడి జిల్లానుంచి తొమ్మిది మంది ఎంపిక కావడం విశేషం. వీరు ఉత్తరప్రదేశ్‌ రాష్ట్రంలోని అయోధ్యలో జరగనున్న జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈసందర్భంగా క్రీడాకారులను ఆర్చరీ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాధుల సారంగపాణి, పుట్టా శంకరయ్య, ఖమ్మం, భద్రాద్రి డీవైఎస్‌ఓలు టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఎం.పరంధామరెడ్డి అభినందించారు.

మంత్రి పువ్వాడ, ఎంపీల దసరా శుభాకాంక్షలు

ఖమ్మంమయూరిసెంటర్‌: దసరా పండుగను పురస్కరించుకుని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. అలాగే, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మేయర్‌ పునుకొల్లు నీరజ కూడా వేర్వేరు ప్రకటనల్లో దసరా శుభాకాంక్షలు తెలిపారు.

పదవి ఇచ్చినోళ్లనే మోసం చేసిండు

- ఆయన కారణంగా పలువురికి రాజకీయ సమాధి
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌

ఖమ్మంమయూరిసెంటర్‌: మంత్రి పదవులు అనుభవించి.. ఆ పదవి ఇచ్చిన సీఎంలు ఎన్టీఆర్‌, చంద్రబాబు, కేసీఆర్‌ను తుమ్మల నాగేశ్వరరావు మోసం చేశారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ విమర్శించారు. ఖమ్మంలో బీఆర్‌ఎస్‌కేవీ ఆధ్వర్యాన ఆదివారం జరిగిన సమావేశంలో పువ్వాడ మాట్లాడుతూ గడచిన తొమ్మిదేళ్ల కాలంలో ఖమ్మం చాలా ప్రశాంతంగా ఉందని, ప్రజలు సంతోషంగా గడుపుతున్నారని పేర్కొన్నారు. కానీ తుమ్మల మంత్రిగా ఉన్న సమయాన ఎందరు రాజకీయ సమాధి అయ్యారో అందరికీ తెలుసునని చెప్పారు. రౌడీయిజాన్ని ప్రోత్సహించి రౌడీ షీటర్లను కాపాడాడని తెలిపారు. సొంత అవసరాలకు ప్రజలను వాడుకుని ఖమ్మంను అభివృద్ధికి దూరం చేశారని విమర్శించారు. 2014 ఎన్నికల్లో తుమ్మలను ఓడించిన తనకు ప్రజల మద్దతు ఉన్నందున ఈసారీ అదే పరిస్థితి ఎదురవుతుందని పువ్వాడ తెలిపారు. ఆతర్వాత బీఆర్‌ఎస్‌ జిల్లా కార్యాలయంలో జరిగిన త్రీటౌన్‌ కమిటీ సమావేశం, రాపర్తినగర్‌లో కార్పొరేటర్‌ రాపర్తి శరత్‌ ఆధ్వర్యాన జరిగిన సమావేశాల్లో కూడా మంత్రి మాట్లాడారు. డీసీసీబీ చైర్మన్‌ కూరాకుల నాగభూషణం, బీఆర్‌ఎస్‌ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు గుండాల కృష్ణ, బీరెడ్డి నాగచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిత్యకల్యాణ వేడుకకు హాజరైన భక్తులు

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక ఆదివారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి ఆరాధన, సేవాకాలం తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. దసరా సెలవుల నేపథ్యాన రామాలయానికి భక్తులు పోటెత్తగా నిత్యకల్యాణంలోనూ అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు.

అవినీతిపరుల చేతుల్లో తెలంగాణ..

- అరాచక శక్తులను సహించొద్దు
- మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమ్మేళనంలో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్‌: పోరాడి సాధించుకున్న తెలంగాణ అరాచక శక్తుల్లో ఉన్నందున వారిని సహిస్తే జన్మకు సార్థకత ఉండదని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలోని గురుదక్షిణ ఫౌండేషన్‌ ప్రాంగణంలో ఈత మిత్రుల ఆధ్వర్యాన ఆదివారం ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పూర్తి సమన్వయంతో పనిచేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది స్థానాలను గెలిపించి తీరుతామని చెప్పారు. తన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఏరోజూ వ్యక్తిగత స్వార్థం కోసం పని చేయలేదని, కేవలం జిల్లా అభివృద్ధి లక్ష్యంగా తపించానని తెలిపారు. అయితే, గత నాలుగున్నరేళ్లుగా భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, కేసులు పెరిగిపోయాయని చెప్పారు. ఈమేరకు ప్రతీ ఒక్కరు ఆలోచించి కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌, పొంగులేటి ప్రసాదరెడ్డి మాట్లాడగా ఆంజనేయప్రసాద్‌, శంకరయ్య, ఆర్‌ఆర్‌.ప్రసాద్‌, లక్ష్మణ్‌, నాగండ్ల నరేందర్‌, మండేపూడి సత్యనారాయణ, మన్నె నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

సమాజ చైతన్యం.. అభినందనీయం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్‌కుమార్‌



కళాకారులకు పారితోషికం అందజేస్తున్న జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్‌, తదితరులు

ఖమ్మంగాంధీచౌక్‌: సమాజ చైతన్యం లక్ష్యంగా ప్రతీనెల నాటక ప్రదర్శనలు నిర్వహిస్తుండడం అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్‌కుమార్‌ అన్నారు. ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నెలనెలా వెన్నెల 75వ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మెప్పు కోసం కాదు, మార్పు కోసం.. రేపటి మంచి కోసం నినాదంతో కొన్నేళ్లుగా నాటికలను ప్రదర్శిస్తుండడం ప్రశంసనీయమన్నారు. అనంతరం శ్రీమిత్ర గ్రూప్స్‌ చైర్మన్‌ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్‌, నిర్మల్‌ హృదయ్‌ పాఠశాల కరస్పాండెంట్‌ వంగా సాంబశివారెడ్డి, కొల్లి సత్యనారాయణ మాట్లాడగా, తెలంగాణ తొలితరం ఉద్యమ నేత అన్నాబత్తుల రవీంద్రనాథ్‌ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్‌ ఆధ్వర్యాన గంగోత్రి సాయి దర్శకత్వంలో మనస్విని నాటికను ప్రదర్శించారు. వల్లూరి శివప్రసాద్‌ రచించిన ఈ నాటికలో డబ్బు అశాశ్వతమని, మానవ సంబంధాలే ముఖ్యమని సందేశాన్ని ఇచ్చారు. అన్నాబత్తుల రవీంద్రనాథ్‌ కళా సాంస్కృతిక సంస్థ (ఆర్క్స్‌) సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఏ.సుబ్రహ్మణ్యకుమార్‌, నాగబత్తిని రవి, నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందం తదితరులు పాల్గొన్నారు.

కోటమైసమ్మ జాతరకు పోదమా!

- నేటి నుంచి ఉసిరికాయలపల్లిలో జాతర
- లక్షలాదిగా తరలిరానున్న భక్తజనం
- ఆకట్టుకునే రీతిలో దేవతామూర్తుల విగ్రహాలు ప్రత్యేకం



జాతరకు ముస్తాబైన శ్రీ కోటమైసమ్మ దేవాలయం



శ్రీకోటమైసమ్మ తల్లి

కారేపల్లి: కొలిచిన వారికి కొంగు బంగారంగా.. భక్తుల కోర్కెలు నెరవేర్చే శ్రీకోటమైసమ్మ తల్లి జాతరకు వేళ అయింది. ఏటా దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే జాతరకు లక్షలాదిగా భక్తజనం తరలిరానున్నారు. అమ్మా మైసమ్మా.. మా తల్లీ మైసమ్మా.. అంటూ వచ్చే భక్తజనంతో జాతర ప్రాంగణం పోటెత్తనుంది. జాతరెల్లి పోదమే.. జాతరో జాతర.. అంటూ మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తులు ప్రభబండ్లను సిద్ధం చేసుకుంటున్నారు.

కారేపల్లి – ఇల్లెందు సరిహద్దులో...

కారేపల్లి మండలం – ఇల్లెందు పట్టణ సరిహద్దు ఉసిరికాయపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీకోటమైసమ్మ తల్లి జాతరను దేవాదాయ ధర్మాదాయ శాఖ, పర్సా ట్రస్ట్‌ ఆధ్వర్యాన ఆదివారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. కారేపల్లి మండలంతో పాటు, కామేపల్లి, రఘునాథపాలెం మండలాల నుంచే కాక సరిహద్దు జిల్లాలైన భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇల్లెందు, టేకులపల్లి, మహబూబాబాద్‌ జిల్లా గార్ల, బయ్యారం, డోర్నకల్‌ మండలాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలిరానున్నారు. ఈసందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు చేసినట్లు దేవాదాయ శాఖ ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్టు చైర్మన్‌ పర్సా పట్టాభిరామారావు వెల్లడించారు.

ప్రత్యేక ఆకర్షణగా దేవతామూర్తులు

కోటమైసమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దేవతా మూర్తుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అంతేకాక దర్శించుకున్న వారికి భక్తిభావన కలిగిస్తాయి. కైలాసంలో కొలువుదీరిన శంకరుడు, 20 అడుగుల ఎత్తుతో పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహం, వినాయక విగ్రహం, శ్రీసరస్వతీ దేవి విగ్రహాలు భక్తులకు ఆధ్యాత్మిక భావన పెంపొందించేలా ఉంటాయి. కాగా, లక్షలాదిగా భక్తజనం జాతరకు తరలిరానున్న నేపథ్యాన పెద్దలు, పిల్లలకు వినోదాన్ని, ఆహ్లాదాన్ని పంచేలా సోలాపూర్‌ సర్కస్‌ ఏర్పాటుచేశారు. అలాగే, జెయింట్‌ వీల్‌ తదితర ఏర్పాట్లు చేయడంతో పిల్లాపాపలు అమ్మవారిని దర్శించుకున్నాక సరదాగా గడిపేందుకు అవకాశం కలగనుంది.



20 అడుగుల పంచముఖ ఆంజనేయ స్వామి

జలవిహార్‌ సమావేశంలో పాల్గొన్న ఎంపీలు





ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్రతో నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్‌: బీఆర్‌ఎస్‌ పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, మంత్రి కేటీఆర్‌ ఆధ్వర్యాన హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఆదివారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసమావేశంలో జిల్లా నుంచి ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపునకు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు చేపట్టాల్సిన బాధ్యతలు, ఇతర అంశాలు, ప్రచార కార్యాచరణ తదితర అంశాలపై ఈ సమావేశంలో కేటీఆర్‌ సూచనలు చేశారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ కొండబాల కోటేశ్వరరావు, సుడా చైర్మన్‌ విజయ్‌కుమార్‌, ఇల్లెందు మార్కెట్‌ మాజీ చైర్మన్‌ హరిసింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

'బతుకు'నిస్తుందని..



పొట్టకూటి కోసం ఓ వ్యక్తి గాంధీ వేషం ధరించాడు. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా ఖమ్మంలోని మున్నేరు వద్దకు ఆదివారం పెద్ద సంఖ్యలో మహిళలు రావడంతో సదరు వ్యక్తి అక్కడ సాయం కోరుతూ కనిపించాడు. బతుకమ్మ ఆడేందుకు, తిలకించడానికి వచ్చిన వారు తమకు తోచిన సాయం చేశారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

అంతా విజయమే...

నేడు విజయ దశమి పండుగ

- అంతటా సంతరించుకున్న ఆధ్యాత్మిక శోభ
- విద్యుత్ లైట్ల వెలుతురులో జిగేల్‌మంటున్న ఆలయాలు
- దసరా సందర్భంగా శమీ చెట్టు పూజ ప్రత్యేకం



విద్యుత్ లైట్ల అలంకరణలో జమ్మిబండ

ఖమ్మంగాంధీచౌక్: శక్తి ఆరాధనకు ప్రాధాన్యతనిచ్చే పండుగ దసరా. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమిగా జరుపుకోవటం అనాదిగా వస్తోంది. ఈమేరకు సోమవారం దసరా పండుగను అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఊరూవాడ ఏర్పాట్లు పూర్తికాగా.. ప్రత్యేక పూజల కోసం ఆలయాలు ముస్తాబయ్యాయి. దూర ప్రాంతాల్లో ఉన్నవారు స్వస్థలాలకు చేరడంతో అనఇనచోట్ల సందడి నెలకొంది. ఇక విజయ దశమి సెంటుమెంట్‌గా పలువురు వాహనాలు, ఇతర సామగ్రి కొనుగోలు చేయనుండడంతో షోరూంల నిర్వాహకులు ఆఫర్లు ప్రకటించారు.

విజయానికి సూచిక

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు నిర్వహించిన భక్తులు పదో రోజు విజయదశమి జరుపుకోవటం ఆచారం. రావణుడిపై రాముడు గెలిచిన రోజుగానే కాకుండా పాండవులు వనవాసం వెళ్తూ జమ్మిచెట్టుపై ఉన్న తమ ఆయుధాలను తీసిన రోజు కూడా దసరానే అని పురాణాలు చెబుతాయి. ఈ సందర్భంగా రావణవధ, జమ్మి ఆకులకు పూజ చేయటం సంప్రదాయంగా వస్తోంది. విజయదశమి రోజున ఏ పని చేపట్టినా విజయం సొంతవుతుందని ప్రజల నమ్మిక.

శమీ వృక్షం పూజ ప్రత్యేకం

దసరా రోజున శమీ వృక్షం పూజ ప్రత్యేకం. ఈ చెట్టును పూజించటం లక్ష్మీ ప్రదమని పురాణాలు చెబుతున్నాయి. విజయదశమి రోజున పూజలు అందుకున్న జమ్మి చెట్టు ఆకులను ఇంట్లో ఉంచడం ఆనవాయితీగా వస్తోంది. పూర్వం జమ్మి చెట్టు కాడల రాపిడి ద్వారా సృష్టించిన అగ్నితోనే యజ్ఞ యాగాదుల నిర్వహించేవారట. ఇప్పటికీ శమీ వృక్షంలో అగ్ని ఉంటుందని.. అగ్ని వీర్యమే సువర్ణం కనుక జమ్మి బంగారాన్ని చెట్టుగా పూజార్హత పొందిందని పురాణాలు ఉంది. శ్రీరాముని వనవాస సమయంలో కుటీరం జమ్మి చెట్టు చెక్కతోనే నిర్మించారని చెబుతారు. శమీ అంటే పాపాల్ని, శత్రువులను నశింప చేసేదిగా పండితులు చెబుతున్నారు. అలాగే, పాండవులు అజ్ఞాత వాసానికి వెళ్లే ముందు తమ ఆయుధాలను శమీ చెట్టుపై భద్రపర్చడంతో ఈ చెట్టును పూజించడాన్ని తపనిసరిగా భావిస్తారు.

దసరాకు ముస్తాబైన ఆలయాలు

శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా పూజలందుకున్న అమ్మవారి ఆలయాలు దసరా వేడుకలకు ముస్తాబయ్యాయి. ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించడమే కాక మామిడి తోరణాలతో తీర్చిదిద్దారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శనానికి రానుండడంతో బారికేడ్లు ఏర్పాటుచేశారు. వివిధ ఆలయాల్లో ఉన్న జమ్మి చెట్టు వద్ద పూజలకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి.

అన్ని ఏర్పాట్లు పూర్తి



దసరా పండుగ సందర్భంగా ఖమ్మం నగరంలోని జమ్మిబండపై శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశాం. తాగునీటి సౌకర్యం కల్పించడమే కాక తీర్థ ప్రసాదాలను సిద్ధం చేశారు. వైభవంగా వేడుకలు జరిగేలా అంతా సిద్ధం చేశాం.

– కొత్తూరు జగన్మోహన్‌రావు, ఈఓ, శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ఖమ్మం

ఖమ్మంలో వేడుకగా దసరా

ఖమ్మం నగరంలో దసరా పండుగకు ఓ ప్రత్యేకత ఉంది. నగరానికి మూలం శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి. నగర నడుబొడ్డున గుట్టపై 16వ శతాబ్దంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వెలిశాడు. దసరా రోజు అడవుల మధ్య ఉన్న గుట్టపైకి భక్తులు వెళ్లడానికి ఇబ్బందిగా ఉండటంతో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని జమ్మిచెట్టు, బండ ఉన్న ప్రాంతానికి తీసుకొచ్చి శమీ పూజ చేయడం అనాదిగా వస్తోంది. కాలక్రమేణా గుట్టపై ఆలయానికి రహదారి ఏర్పాటు కావటం, జమ్మిబండ ఉన్న ప్రాంతం అభివృద్ధి కావటంతో వేడుకలను మరింత వైభవంగా జరుపుకోవడానికి అవకాశం కలిగింది. దసరా రోజు శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని గుట్టపై ఆలయం నుంచి పల్లకీలో జమ్మిబండకు తీసుకొచ్చి రాతి మండపంపై కొలుదీరుస్తారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే సోమవారం సాయంత్రం 5:30 గంటలకు స్వామి పల్లకీ సేవ ప్రారంభిస్తారు. 6:30 గంటలకు స్వామి వారిని జమ్మిబండపైకి చేర్చి 9:30 గంటల వరకు భక్తుల దర్శనార్థం ఉంచుతారు. ఇదేక్రమంలో రావణాసుర దహనం కూడా నిర్వహిస్తారు.

నేడు పాలేరులో పర్యటించనున్న పొంగులేటి

ఖమ్మంవన్‌టౌన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎంపీ, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం పాలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు కూసుమంచి, పాలేరుల్లో, సాయంత్రం 4గంటలకు రెడ్డిపల్లి, రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మకాలనీ, సత్యనారాయణపురం, చిన్నతండా, నాయుడుపేట, జలగంనగర్, పెద్దతండా, నడిమితండాల్లో జరిగే కార్యక్రమాల్లో పొంగులేటి పాల్గొంటారని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.









ప్రచారానికి ఇదే అదును !

- ఓటర్లకు కలిసేలా ప్రణాళిక
- సత్తుపల్లిలో ఎమ్మెల్యే సండ్ర ఆధ్వర్యాన ఏర్పాట్లు
- దసరా వేళ ఇళ్లలోనే ప్రజలు ఉండడంతో నిర్ణయం



బీమా చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి: అంతా ఎన్నికల మూడ్‌లోకి వెళ్లారు... ఇప్పటికే టికెట్లు ఖరారైన అభ్యర్థులు ప్రచారంలోకి నిమగ్నమయ్యారు. అయితే, సోమవారం దసరా జరగనుండగా ప్రజలంతా ఇళ్ల వద్దే ఉంటారు. దీంతో ఇదే అవకాశంగా ప్రచారాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈమేరకు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పార్టీ శ్రేణులతో సమావేశమై దసరా పండుగను కూడా ప్రజల మధ్యలోనే జరుపుకుంటూ ఈ మూడు రోజులు బీఆర్ఎస్ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ అందించాలని సూచించారు. రోజుకు 150 ఇళ్ల చొప్పున వెళ్లి ఇప్పటివరకు బీఆర్ఎస్ అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను చెప్పడమే కాక మేనిఫెస్టోలోని అంశాలను వివరించాలని తెలిపారు. కాగా, సోమవారం సత్తుపల్లి మండలం రామానగరం నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించి.. మొత్తం లక్ష కుటుంబాలను కలవాలనే లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. కాగా, సత్తుపల్లి అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా ఎంపీ బండి పార్థసారధిరెడ్డికి సీఎం కేసీఆర్ బాధ్యతలు అప్పగించడంతో ఆయన కూడా ఒకటి, రెండు రోజుల్లో రంగంలోకి దిగనున్నారు.

ఇప్పటికే కేటీఆర్.. త్వరలో కేసీఆర్

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రాకముందు, వచ్చాక ఎమ్మెల్యే సండ్ర వెంటవీరయ్య దాదాపు అన్ని గ్రామాల్లో పర్యటించారు. సెప్టెంబర్ 30న సత్తుపల్లి సభకు మంత్రి కేటీఆర్ హాజరుకాగా ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ఇక నవంబర్ 1వ తేదీన సీఎం కేసీఆర్ కల్లూరులో జరిగే ఎన్నికల సభలో పాల్గొననుండడంతో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని దళితులందరికీ దళితబంధు అమలుచేయడమే కాక సత్తుపల్లి జిల్లా అంశాన్ని పరిశీలిస్తామని కేటీఆర్ ప్రకటించడంతో వీటినే ప్రచారాస్త్రాలుగా ఉపయోగించుకోవాలనే ఆలోచనలో బీఆర్ఎస్ వర్గాలు ఉన్నాయి.

కేసీఆర్ బీమా.. కుటుంబానికి ధీమా..

సీఎం కేసీఆర్ ఆధ్వర్యాన 93 లక్షల మందికి బీమా కల్పించి కుటుంబాలకు ధీమా ఇచ్చారని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. సత్తుపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కును ఆదివారం ఆయన అందజేసి మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావుతో పాటు వేములపల్లి మధు, మట్టా ప్రసాద్, ఎస్.కే.బుడేన్, ఎస్.కే.కరీముల్లా, పఠాన్ ఆషాఖాన్, రామకృష్ణ, ఈడా నాగేశ్వరరావు, మిద్దె శ్రీను, కంటే అప్పారావు పాల్గొన్నారు.





ఏఐసీసీ నేతలను కలిసిన జిల్లా నాయకులు



థాక్రేతో మాట్లాడుతున్న జావీద్, రాయల నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: ఏఐసీసీ నేత కే.సీ.వేణుగోపాల్, కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ థాక్రేను పీసీసీ సభ్యులు మహ్మద్ జావీద్, రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు ఆదివారం సాయంత్రం ఢిల్లీలో కలిశారు. ఖమ్మం, పాలేరు, కొత్తగూడెం టికెట్ల కోసం వీరు దరఖాస్తు చేసుకోగా, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పార్టీలో చేరడంతో ఖమ్మం, పాలేరు టికెట్లు ఖరారైనట్లు చెబుతున్నారు. అలాగే, కొత్తగూడెం సీటును భాగంగా సీపీఐకి కేటాయించే అవకాశముందన్న ప్రచారం మొదలైంది. ఈక్రమంలోనే ఏఐసీసీ నుంచి వచ్చిన పిలుపుతో ఢిల్లీ వెళ్లిన నాయకులు సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో కలిసి వేణుగోపాల్, థాక్రేను కలిశారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చాక సముచిత స్థానం కల్పిస్తామని నాయకులు హామీ ఇచ్చి నట్లు సమాచారం.





● భా...రీ బతుకమ్మ !



కూసుమంచి: మండలంలోని పెరికసింగారంలో సద్దుల బతుకమ్మ పండుగను నిర్వహిస్తుండడం ఘనంగా ఆనవాయితీగా వస్తుంది. ఈక్రమంలో బతుకమ్మను అందంగానే కాక భారీగా పేర్చడంలో గ్రామస్తులు పోటీ పడుతుంటారు. అదేమాదిరి ఈసారి కూడా గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు కుటుంబసభ్యులు భారీ బతుకమ్మను పేర్చి ఔరా అనిపించారు. ఇందుకోసం మూడు క్వింటాళ్ల బంతిపూలు, క్వింటాన్నర టేకుపూతతో పాటు తంగేడు, తదితర పూలు వినియోగించారు.





పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మండలంలోని తల్లంపాడులో 1993-94 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను సన్మానించి... చదువుకున్న నాటి అనుభవాలను పంచుకున్నారు.

– ఖమ్మంరూరల్





గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



పత్తిపాటి రవి (ఫైల్)

సత్తుపల్లిరూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఓ ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన పత్తిపాటి రవి(38)ఆదివారం సత్తుపల్లి నుంచి కిష్టారం వైపు వెళ్తుండగా సింగరేణి ఓసీ దగ్గర గుర్తుతెలియని వాహనం అతివేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించి, అక్కడి నుంచి ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రవికి భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమార్తెలు ఉండగా, ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





విజయ దశమి ప్రత్యేకం

స్త్రీ శక్తి విజయం విజయ దశమి



ఈ చరాచర జగత్తుని నడిపించేది శక్తి. ఈ శక్తి లేనట్టయితే బ్రహ్మా విష్ణు మహేశ్వరులు తమ తమ కృత్యాలైన సృష్టి స్థితిలయాలు నిర్వర్తించటమే కాదు, కదలటం కూడా చేత కాని వారవుతారు. ఆ శక్తినే అదిశక్తి, పరాశక్తి అంటారు. ఆ శక్తి త్రిగుణాత్మకంగా ఉంటుంది. సత్వరజస్తమో గుణాలతో శక్తిబీజం సంయోగం చెందితే 'స్త్రీ' అవుతుంది. అటువంటి త్రిగుణాలతో కూడిన శక్తి ఆవిర్భవించి దుష్టరాక్షస సంహారం చేసిన సమయం శరదృతువు.

ఇవే కాదు మహాశక్తి ఎప్పుడు ఎక్కడ దుష్టసంహారం చేయవలసిన అవసరం వచ్చినా, శిష్టరక్షణ చేయవలసిన అవసరం కలిగినా జీవులపై ఉన్న అంతులేని ప్రేమతో అవతరిస్తూ వచ్చింది. ఎంతైనా జగన్మాత కదా! అన్ని సందర్భాలలోను ఆ తల్లి ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అవతరించి నవమి నాడు రాక్షససంహారం చేయటం జరిగింది. కనుక ఆదిపరాశక్తిని ఆ సమయంలో పూజించి ఆ తల్లి అనుగ్రహం పొందటం సంప్రదాయం అయింది.

అందరు దేవతల శక్తి ఏకీకృతమై రూపుదాల్చిన శ్రీదేవి రాక్షసులతో యుద్ధంచేసే సమయంలో దేవతలు, ఋషులు ఆమెకు పుష్టి కలగటానికి – యజ్ఞాలు, హోమాలు, జపాలు, తపాలు, పూజలు, పారాయణలు మొదలైన దీక్షలు పూనారు. మానవులు కూడా ఉడతాభక్తిగా తమకు తోచిన విధంగా దీక్షలు చేయటం మొదలు పెట్టారు.

ప్రథమంగా ఆవిష్కృతమైన శక్తి తమోగుణ ప్రధానమైనది. నిర్గుణయైన పరాశక్తి మొదటి సగుణ ఆవిర్భావం తమోగుణమయమైన మహాకాళి. అందువల్లనే మహాకాళీ మహాలక్ష్మీ మహాసరస్వతీ అని జగదంబిక త్రిశక్తులలో మొదటిదిగా మహాకాళినే పేర్కొనటం జరుగుతుంది.

ఇది వైవస్వత మన్వంతర వృత్తాంతం.

సావర్ణి మన్వంతరంలో ఆదిపరాశక్తి రజోగుణ ప్రధానమైన మహాలక్ష్మిగా అవతరించింది. దానికి హేతువు మహిషాసురుడు.ఈ తత్వాన్ని వంట పట్టించుకోవటం ఏ కాలం లోనైనా అవసరమే. మహిషాసురులు ఎప్పుడూ ఉంటారు. అందుకే మహిషాసుర మర్దినులైన మహాలక్ష్ముల అవసరం ఎప్పుడూ ఉంటుంది.

మహిషుని సంహరించేందుకు త్రిమూర్తుల నుంచి ఉద్భవించిన తేజస్సు అమ్మవారిగా ఆకారం ధరించింది. దేవతలందరూ ఆమెకు తమ తేజస్సును, ఆయుధాలను సమకూర్చారు. తన సంహారం కోసమే ఆమె ఆవిర్భవించిందని తెలిసినా మహిషుడు రకరకాలుగా ఆమెను ప్రలోభపెట్టాలని చూశాడు. ఆమె అంగీకరించకపోయేసరికి కామరూపి గనుక ఆమెతో రకరకాల రూపాలతో యుద్ధం చేశాడు. ఆ రూపాలకు తగిన రూపాలను ధరించి దేవి మహిషరూపంలో ఉన్న రాక్షసుని సంహరించింది. ఇది జరిగింది ఆశ్వయుజ శుద్ధ నవమి రోజున. అప్పటివరకు దీక్ష వహించిన వారందరు దశమి నాడు జగదంబను స్తుతించి, అమ్మకు పట్టాభిషేకం చేసి, స్త్రీ శక్తి విజయానికి వేడుకలు చేసుకుని ఆనందించారు. వారి స్తుతులకు సంతసించిన శ్రీదేవి వారిని వరం కోరుకోమన్నది. తమకు అవసరమైనప్పుడు ఈ విధంగా కాపాడమని కోరారు. ఆమె వారు తలచినప్పుడు అవతరిస్తానని మాట ఇచ్చింది.

మరొకప్పుడు శుంభ నిశుంభులనే దానవ సోదరులు వేల ఏండ్లు తపస్సు చేశారు. బ్రహ్మ వారి తపసుకి మెచ్చి, ప్రత్యక్షమై వరం కోరుకోమంటే – తమకు అమరత్వం ప్రసాదించమని కోరారు. బ్రహ్మ అది తన చేతులలో లేదని, ఇంకేదైన వరం కోరుకోమని అన్నాడు. వారు తమకు అమర, నర, పశు, పక్షి పురుషుల వల్ల చావులేని వరం ఇమ్మని కోరారు. అంతటితో ఆగలేదు. స్త్రీలు బలహీనులు కనుక మాకు వారి వల్ల భయం లేదు అని చెప్పారు. బ్రహ్మ తథాస్తు అన్నాడు. స్వర్గంపై దాడి చేసి, ఇంద్రుని ఆసనాన్ని అధిరోహించి, త్రైలోక్యాధిపత్యాన్ని, యాగభాగాలని కూడా హరించారు. దిక్పాలకులను సూర్యచంద్రాది దేవతలను గెలిచి, వారి పదవులను కూడా గ్రహించాడు. వారి పనులు కూడా తానే చేయటం మొదలు పెట్టాడు.

దేవతలు బృహస్పతి సూచనననుసరించి హిమవత్పర్వతం మీద ఉన్న దేవిని శరణు వేడారు. జగదంబ వారికి అభయం ఇచ్చింది. ఆ సమయంలో సర్వదేవతలు తమ తమ శక్తులను జగదంబకు తోడుగా పంపారు. అవన్నీ ఆయా దేవతలకు చెందిన ఆభరణాలను, ఆయుధాలను ధరించి, వాహనాలను అధిరోహించి వచ్చి రక్తబీజుని సైన్యాన్ని మట్టు పెట్టసాగాయి. ఈ శక్తులను మాతృకాగణాలు అంటారు.

1. బ్రహ్మ శక్తి బ్రహ్మణి.
2. విష్ణువు శక్తి వైష్ణవి
4. కుమారస్వామి శక్తి షష్ఠీ దేవి కౌమారి.
5. ఇంద్రుని శక్తి ఐంద్రి, మాహేంద్రి, ఇంద్రాణి అనే పేర్లు కూడా ఆమెకున్నాయి.
6. ఆదివరాహమూర్తి శక్తి వారాహీ దేవి
7. నృసింహుని శక్తి నరసింహ రూపం నారసింహీ అనే నామం.

ఈ మాతృకా గణంతో పాటుగా వరుణుని శక్తి వారుణీదేవి శత్రువులని పాశంతో బంధించి, మూర్చితులను చేసి, ప్రాణాలను తీస్తోంది.

యముని రూపంతో యముని శక్తి యామ్యాదేవి మహిషము నెక్కి, దండాన్ని ధరించి, భయం గొలిపే విధంగా రణభూమిలో అడుగు పెట్టి, దానవులని యమసదనానికి పంపుతోంది. వీరికి తోడు శివదూతి కూడ విజృంభించి దానవులను నేలకూల నేస్తూ ఉంటే, చాముండా, కాళికలు వారిని తినేస్తున్నారు.

దానవులు భయపడి పారిపోతుంటే రక్తబీజుని కోపం మిన్ను ముట్టి, దేవితో యుద్ధానికి వచ్చాడు. మాతృకాగణాలు అతడిపై ఆయుధాలను వేయగానే వాడి శరీరం నుండి కారిన ప్రతి రక్తబిందువు నుండి, ఒక్కొక్క రక్తబీజుడు పుట్టి వారి సంఖ్య అసంఖ్యాకం అయింది. దేవతలందరు భయభ్రాంతులై పోయారు. అప్పుడు అంబిక కాళికను నోరు పెద్దది చేసి, రక్తబీజుడి నుండి కారుతున్న రక్తాన్నంతా తాగివేయ మని చెప్పింది. వాడి శరీరం నుండి కారుతున్న రక్తాన్ని, కింద పడకుండా తాగటంతో వాడు నీరసించాడు. వాడి శరీరాన్ని శ్రీదేవి ముక్కలు చేస్తుంటే, కాళిక తినేసింది. అంబిక వాహనమైన సింహం కూడా ఎంతో మంది దానవులని తినేసింది.

అపుడు నిశుంభుడు శ్రీదేవితో యుద్ధానికి బయల్దేరాడు. ముందుగా నిశుంభుడి తల తెగ నరికింది దేవి. అయినా అతడి మొండెం కత్తి పట్టుకొని తిరుగుతుంటే ఆ మొండెం కాళ్ళు చేతులు నరికింది దేవి. దానితో నిశుంభుడు అసువులు బాసాడు.

శుంభుణ్ణి శ్రీదేవి తనతో యుద్ధం చేయలేకపోతే చండికతో గాని, కాళికతో గాని యుద్ధం చెయ్యమంది. అతడు పౌరుషం పెరిగి, శ్రీదేవితోనే యుద్ధం చేయ దలచాడు. ఘోరయుద్ధం తరువాత శ్రీదేవి శుంభుని పరిమార్చింది. దేవతలకు తిరిగి స్వర్గ రాజ్యం లభించింది. మాటలతో సాధించిన విజయానికి సంకేతం ఇది. మాట నైపుణ్యంతో యుద్ధానికి ఆహ్వానించి గెలిచిన జగన్మాత అవతారాన్ని మహా సరస్వతిగా చెప్పటం జరిగింది.

సామూహికంగా కుంకుమార్చనలు చేసినా, చండీహోమాదులు చేసినా, బొమ్మల కొలువులు పెట్టినా, బతకమ్మలు ఆడినా కనపడేది ఏదైనా పది మంది కలిసి చేయాలనే ఐక్యభావన. శక్తి స్వరూపమైన స్త్రీ జాతి పట్ల గౌరవ మర్యాదలు నెరపటం.

''యా దేవీ సర్వ భూతేషు శక్తి రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః.''

– డాక్టర్ ఎస్.అనంతలక్ష్మి



నవరాత్రులు అన్నా, అమ్మవారి పూజలన్నా ప్రధానంగా చేసేది లలితా రహస్య నామ సాహస్ర పారాయణం. కుంకుమార్చన చేసినా సహస్రనామాలతోనే చేస్తారు. జగదంబ లలితాదేవిగా ఆవిర్భవించిన ఇతివృత్తం బ్రహ్మాండ పురాణం లలితో పాఖ్యానంలో వివరించబడింది. ఆమె సర్వచైతన్యస్వరూపిణి కనుక ఆమెను 'లలిత' అని పిలిచారు.తమను కన్నతల్లి లాగా భావించి శ్రీమాతా! అని సంబోధించారు. జీవితం అంటే సుఖపడటం – సుఖపడటం అంటే తినటం, నిద్ర పోవటం మాత్రమే అని భావించటమే బండతనం. అటువంటి వారికి ఉండేది శూన్యమే కదా! బండతనం పోవాలంటే తగిన మార్గం ఒకటే. అది చైతన్యవంతులు కావటమే. అందుకే జగదంబ భండాసురవధ చేయటానికి సర్వచైతన్యస్వరూపిణిగా అవతరించింది. బండతనం మీద చైతన్యం విజయం సాధించటానికి సంకేతం విజయదశమి. శరన్నవరాత్రులలో అమ్మ అవతారాలలో లలితాదేవి అవతారం ఎంతో ప్రాధాన్యాన్ని కలిగి ఉంటుంది. నిజానికి శక్తి అన్నా, చైతన్యమన్నా ఒకటిగానే భాసిస్తాయి. చైతన్యం లేనిదే శక్తి వ్యక్తం అయ్యే అవకాశం లేదు కదా!



సమాజంలో ఎప్పుడూ మంచి చెడూ కలిసే ఉంటాయి. వాటి మధ్య జరిగే సంఘర్షణలో మంచి గెలవటానికి ప్రతీక విజయ దశమి. అలా మంచి గెలవటానికి ఎప్పుడు ఏ శక్తి కావాలో ఆ శక్తిగా అవతరించి సజ్జనులకు తోడుపడుతుంది జగన్మాత. అది శరీరంలో అనారోగ్యం కావచ్చు, మనస్సులో ఉన్న దుర్గుణాలు, దురాలోచనలు కావచ్చు, సమాజంలో ఉన్న దురాచారాలు, మూఢనమ్మకాలు కావచ్చు, ప్రకృతిని, పర్యావరణాన్ని కలుషితం చేసే మాలిన్యాలు కావచ్చును, సృష్టి నియమాలకి విరుద్ధంగా కలకాలం బతికి ఉండాలనే స్వార్థం కావచ్చును, ఒక జాతినో, వర్గాన్నో చులకన చేసే అహంకారం కావచ్చు ఒక జాతినో, వర్గాన్నో అవమానం చెయ్యటం కావచ్చును – ఇటువంటి ఎన్నో చెడులక్షణాల మీద విజయం సాధించిన రోజు విజయ దశమి. ముఖ్యంగా స్త్రీ పట్ల చులకన భావం కలిగిన దున్నపోతు మనస్తత్వం మీద స్త్రీ శక్తి విజయానికి సంకేతం విజయ దశమి. సద్భావనలు పెంపొందించుకునే రోజు. అందుకే ఒకరినొకరు అభినందించుకుంటూ జమ్మి పత్రాలని బంగారం, వెండి అనే పేరుతో పంచుకుంటూ ఉంటారు.

సినిమా

టైగర్ నాగేశ్వరరావు సంతృప్తి ఇచ్చింది – రవితేజ



● అభిషేక్ అగర్వాల్, వంశీకృష్ణ, రవితేజ, వివేక్ కూచిభొట్ల, మయాంక్ సింఘానియా

"'టైగర్ నాగేశ్వరరావు' చిత్రాన్ని ప్రేక్షకులు, నా శ్రేయోభిలాషులు, నా అభిమానులు గొప్పగా ప్రశంసిస్తున్నారు. వాళ్లే ఈ సినిమాని బ్రహ్మాండంగా ప్రమోట్ చేయడం ఆనందంగా ఉంది. 'విక్రమార్కుడు' చిత్రంలోని విక్రమ్ రాథోడ్ తర్వాత నాకు మళ్లీ అంతటి సంతృప్తిని ఇచ్చిన పాత్ర 'టైగర్ నాగేశ్వరరావు'. ఈ చిత్రాన్ని ఇంత గొప్పగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని హీరో రవితేజ అన్నారు. వంశీ కృష్ణ దర్శకత్వంలో రవితేజ హీరోగా, నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న(శుక్రవారం) విడుదల అయింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా సక్సెస్ మీట్‌లో రవితేజ మాట్లాడుతూ– ''అభిషేక్ అగర్వాల్ ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాని తీశారు. ఆయన భవిష్యత్‌లో భారీ సినిమాలు తీసి, హిట్లు కొట్టాలి. వంశీలో మంచి ప్రతిభ ఉంది. తనతో మళ్లీ సినిమా చేయాలని ఉంది'' అన్నారు. ''నాకు ఇది పెద్ద సినిమా. రవితేజ, అభిషేక్‌గార్ల వల్లే ఇది సాధ్యపడింది. వీడు మావాడు అని చెప్పుకునేలా సినిమాలు తీస్తూనే ఉంటాను'' అన్నారు వంశీకృష్ణ. ''మా సినిమాకి ప్రేక్షకుల స్పందన, షోలు, వసూళ్లు రోజురోజుకి పెరుగుతున్నాయి'' అన్నారు అభిషేక్ అగర్వాల్. ఈ కార్యక్రమంలో నిర్మాతలు వివేక్ కూచిభొట్ల, మయాంక్ సింఘానియా తదితరులు పాల్గొన్నారు.

ఆ కిక్కే వేరు రా!

"నేను దాన్ని ఎంత ప్రేమిస్తున్నానంటే, దానికి ఫ్రెండ్స్, ఫ్యామిలీ ఎవరూ అక్కర్లేదు రా..! నేను చాలు..! ట్వంటీఫోర్ హవర్స్ పిల్ల నాతోనే ఉండాలనిపిస్తది.. నాది అని చెప్పుకోవడానికి ఓ గర్ల్ ఫ్రెండ్ ఉంటే.. ప్చ్.. ఆ కిక్కే వేరు రా..!'' అనే డైలాగ్స్‌తో కూడిన వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా మోషన్ పోస్టర్. హీరోయిన్ రష్మికా మందన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ఇది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించనున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్‌మెంట్ పతాకాలపై విద్య కొప్పినేని, ధీరజ్ మొగిలినేని నిర్మించనున్న 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాను ఆదివారం అధికారికంగా ప్రకటించారు. ''ఈ ప్రపంచం ప్రేమకథలతో నిండిపోయి ఉంది. కానీ ఈ ప్రేమ కథల్లో ఇప్పటివరకు ఎవరూ వినని, చూడనవి కూడా ఉన్నాయి. 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రం అలాంటిదే'' అని ట్వీట్ చేశారు రష్మికా మందన్నా. ''ఈ సినిమా ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని ఇస్తుంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్, కెమెరా: కృష్ణన్ వసంత్.



● 'ది గర్ల్ ఫ్రెండ్' లో రష్మిక


అప్పుడే అది జరుగుతుంది – అల్లు అర్జున్



● దేవిశ్రీ ప్రసాద్, అల్లు అర్జున్

"'పుష్ప' చిత్రానికి నేను, దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డులు అందుకోవడం సంతోషంగా ఉంది. ఏదైనా మనం మనసులో గట్టిగా అనుకుంటే జరుగుతుందని అంటుంటారు. అయితే మనం అనుకున్నా, కష్టపడినా అది యాభై శాతం మాత్రమే జరుగుతుంది. మిగతా యాభై శాతం మన చుట్టూ ఉన్న వాళ్లు కూడా కోరుకోవాలి.. అప్పుడే అది జరుగుతుంది'' అని హీరో అల్లు అర్జున్ అన్నారు. 'పుష్ప' చిత్రానికి జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ సంగీత దర్శకుడుగా దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డులు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. జాతీయ అవార్డుల్లో సత్తా చాటిన తెలుగు నటీనటులను, సాంకేతిక నిపుణులను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాతలు నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ– ''నాకు జాతీయ అవార్డు రావాలని కోరుకునేవాణ్ణి. అయితే నా కంటే బలంగా కోరుకున్నారు దర్శకుడు సుకుమార్‌గారు. నేను అచీవ్‌మెంట్ అయితే సుకుమార్ అచీవర్'' అన్నారు. దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ–''అల్లు అర్జున్, సుకుమార్‌గార్లతో పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంటుంది. మైత్రీమూవీ మేకర్స్ అంటేనే రాజీపడని నిర్మాతలు'' అన్నారు. ఈ వేడుకలో నటుడు ప్రకాష్ రాజ్‌తో పాటు పలువురు హీరోలు, దర్శకులు, నిర్మాతలు, నటీనటులు పాల్గొన్నారు.

కృష్ణారామా మా ఇంట్లో పుట్టిన కథే – దర్శకుడు రాజ్ మదిరాజు



''ప్రస్తుతం చాలా మంది తమ తల్లిదండ్రులకు దూరంగా జీవిస్తున్నారు. దీంతో ఒంటరి తనంగా భావించిన తల్లిదండ్రులు తమ మనసులోని భావాలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసుకుంటున్నారు. మా తల్లిదండ్రులు కూడా ఒంటరితనాన్ని దూరం చేసుకోవడానికి ఫేస్ బుక్‌లోకి వచ్చారు. ఒక విధంగా '#కృష్ణారామా' కథ మా ఇంట్లో పుట్టిందే'' అని దర్శకుడు రాజ్ మదిరాజు అన్నారు. రాజేంద్ర ప్రసాద్, గౌతమి ప్రధాన పాత్రల్లో అనన్య శర్మ కీలక పాత్రలు పోషించిన చిత్రం ''#కృష్ణారామా'. అద్వితీయ మూవీస్‌పై వెంకట కిరణ్, కుమార్ కళ్లకూరి, హేమ మాధురి నిర్మించిన ఈ సినిమా ఆదివారం నుంచి ఓ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు రాజ్ మదిరాజు మాట్లాడుతూ– ''మన తల్లిదండ్రులు రిటైర్ అయిపోతే వాళ్ల జీవితమే అయిపోయిందనే భావనలోకి వెళ్లిపోతున్నాం. కానీ, వారి అనుభవం సమాజానికి ఎంతో అవసరం అని మా సినిమా ద్వారా చెబుతున్నాం. ఒక డైరెక్టర్‌గా నా పనిని నేను ఇష్టపడతాను. నటుడిగా నా పరిధిలోనే ఉంటాను.. డైరెక్టర్స్‌కి సలహాలు, సూచనలు ఇవ్వను. ప్రస్తుతం డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి సినిమాలో ఓ మంచి పాత్ర చేశాను. డైరెక్టర్‌గా రెండు మూడు కథలు సిద్ధంగా ఉన్నాయి'' అన్నారు.

ఓ సవాల్‌గా తీసుకున్నా – తల్లాడ వెంకన్న



● వెంకన్న

తల్లాడ వెంకన్న హీరోగా నటించిన చిత్రం 'ఒక్కడే నెం.1'. సునీత, శృతిక, మధువని హీరోయిన్లుగా నటించారు. శ్రీపాద రామచంద్రరావు దర్శకత్వంలో క్లాసిక్ సినీ క్రియేషన్స్‌పై నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో తల్లాడ వెంకన్న మాట్లాడుతూ–''వ్యాపారవేత్తగా సక్సెస్ అయిన నేను, సినిమా రంగాన్ని కూడా ఓ సవాల్‌గా తీసుకున్నాను. మంచి కథ, కథనంతో 'ఒక్కడే నెం.1' తీశాం. సురేశ్ బాబు, ఏషియన్ ఫిలింస్ వారు తెలుగు రాష్ట్రాల్లో మా సినిమాను రిలీజ్ చేసేందుకు ఒప్పుకోవడంతో సినిమా విజయంపై మా నమ్మకం మరింత పెరిగింది. కర్ణాటకలో కూడా డైరెక్ట్ రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''నేను గతంలో భక్తిరస చిత్రాలు తీశాను. వెంకన్నగారి ప్రోత్సాహం వల్లే 'ఒక్కడే నెం.1' లాంటి మంచి కమర్షియల్ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం లభించింది'' అన్నారు దర్శకుడు శ్రీపాద రామచంద్రరావు. నిర్మాతలు సి.కల్యాణ్, దామోదర ప్రసాద్, అంబికా కృష్ణ, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, దర్శకుల సంఘం అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్, డైరెక్టర్ రేలంగి నరసింహారావు అతిథులుగా పాల్గొని, ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

భలే చాన్స్



● శ్రీనిధి

'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి మంచి జోరుమీద ఉన్నారు. ఇటీవల తెలుగులో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న 'తెలుసు కదా' సినిమాలో ఓ హీరోయిన్‌గా నటించేందుకు శ్రీనిధి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ బ్యూటీ భలే చాన్స్ అందుకున్నారు. కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ సరసన నటించనున్నారు శ్రీనిధి శెట్టి. హీరో సుదీప్, దర్శకుడు చేరన్ కాంబినేషన్‌లో సత్యజ్యోతి ఫిలింస్ ఓ సినిమాను నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించనున్నారు శ్రీనిధి. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌లో జాయిన్ కానున్నారట ఈ బ్యూటీ.

తండ్రీకొడుకుల నేపథ్యంలో...



● ధన్‌రాజ్

నటుడు ధన్‌రాజ్ దర్శకుడిగా మారారు. ఈ కొత్త చిత్రంలో తండ్రి పాత్రలో సముద్రఖని, కొడుకు పాత్రలో ధన్‌రాజ్ నటించనున్నారు. ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో స్లేట్ పెన్సిల్ స్టోరీస్ బ్యానర్‌పై పొలవరపు పృథ్వి తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు సుబ్బు కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు శివబాలాజీ క్లాప్ ఇచ్చారు. తొలి సన్నివేశానికి 'బలగం' దర్శకుడు వేణు గౌరవ దర్శకత్వం వహించగా, తెలుగు స్క్రిప్ట్‌ను దర్శకుడు రాజేంద్ర, తమిళ స్క్రిప్ట్‌ను దర్శకుడు భరత్‌కమ్మ యూనిట్ సభ్యులకు అందించారు. 'విమానం' చిత్ర దర్శకుడు శివ ప్రసాద్ యానాల ఈ మూవీకి కథ–మాటలు అందిస్తున్నారు. ''తండ్రీ కొడుకుల భావోద్వేగాల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనుంది. నవంబరు 9 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రం ప్రారంభోత్సవంలో నటులు సుడిగాలి సుధీర్, చమ్మక్ చంద్ర, తాగుబోతు రమేష్, మధునందన్, భూపాల్, పృథ్వి, 'రాకెట్' రాఘవ తదితరులు పాల్గొన్నారు. ఈ సినిమాకు సంగీతం: అరుణ్ చిలువేరు, కెమెరా: దుర్గా ప్రసాద్.

అందరూ మెచ్చే చిత్రాలు చేస్తా – నిర్మాత సతీష్ కుమార్



''గతంలో నేను నిర్మించిన 'బట్టల రామస్వామి బయోపిక్', 'కాఫీ విత్ ఏ కిల్లర్' సినిమాలు ప్రేక్షకాదరణ పొందాయి. ప్రస్తుతం గౌతమ్ కృష్ణ హీరోగా ఓ చిత్రం నిర్మిస్తున్నాను. యువత, కుటుంబ ప్రేక్షకులతో పాటు అందరూ మెచ్చే చిత్రాలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నా'' అని నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ కుమార్ అన్నారు. గౌతమ్ కృష్ణ, శ్వేతా అవస్తి, రమ్య పసుపులేటి హీరో హీరోయిన్లుగా పి.నవీన్ కుమార్ దర్శకత్వంలో కొత్త సినిమా రూపొందుతోంది. సెవెన్ హిల్స్‌పై సతీష్ కుమార్ నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం) తన పుట్టినరోజు సందర్భంగా సతీష్ కుమార్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ–''ఒక సాధారణ మధ్యతరగతి వ్యక్తి స్టూడెంట్ నుంచి కార్పొరేట్ స్థాయికి ఎలా ఎదిగాడు? అనే నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. గౌతమ్ కృష్ణ ప్రస్తుతం బిగ్‌బాస్ తెలుగు సీజన్ 7 షోలో ఉన్నారు. ఆ షో నుంచి తిరిగి రాగానే మా సినిమా చివరి షెడ్యూల్ పూర్తి చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: త్రిలోక్ సిద్ధు, సంగీతం: జుడా శాండీ.